# రమణి

[కథానిక]

= శ్రీ ఎ. శేషగిరిరావు =

అసలీవిషయం ఎవరితోనూ ఎప్పుడూ చెప్పకూడదనుకున్నాను. కాని అది నామనస్సులో చాలా బాధపెడుతూంది. చెప్పేస్తే కొంత బాధైనా తగ్గుతుందనే అభిప్రాయం కలిగింది. మరొకటి: నాస్థితిలోనే మరెవరైనా ఒకప్పుడుంటే వాళ్ళకి దారికూడా చూపవచ్చుననే భ్రమకూడ కొంచెం కలిగింది. అందుచే బైటపెడుతున్నా.

ఇది జరిగి యిరవైయేళ్ళైంది. కాని నాకు నిన్నో, మొన్నో జరిగినట్లుంది. తలపుకొచ్చినరోజున నిద్దుర పట్టదు. ఇంతకూ నేను చేసిన తప్పు నాకు స్పష్టం కాదు. కాని వెనకనుంచి యేదో తప్పుచేసినట్లు మనస్సు బాధిస్తూఉంటుంది.

నేను మొదట రమణిని చూచినప్పుడు నాకు పదకొండేళ్లు. నాలుగోఫారంలో చదవడానికి మాపల్లెటూరినుండి పట్నం వెళ్లేను. నాకంతా క్రొత్తగా ఉండేది.

నాకు అక్కలు చెల్లెళ్లేగాని, అన్నదమ్ములు లేరు. ఆడపిల్లలు పాడే పాటలు పాడేవాడిని. చాలా బాగా పాడతానని అందఱూ అనేవాళ్లు. బలవంతం చేసి మా మేష్టరుగారు బడినాటకంలో వేషంకూడా వేయించారు. చూడ్డానికి వచ్చినాయన నొకరు ఒక మెడలుకూడ యిచ్చేరు. నాకు సిగ్గు, భయం అట్టే ఉండేవి కావు. ఎవరు పాడమన్నా పాడేవాడిని. నాకు వాళ్లు టిఫినులూ అవీ పెడుతూఉండేవారు. నేను కొందఱు పెద్ద విద్యార్థులతో ఒక లాడ్జిలో ఉండేవాడిని. సాయంత్రం బడినుండి రాగానే యేవో పాటలు పాడుతూ, ఆడుతూ ఉండేవాడిని. నాకు పువ్వుల తోట అంటే సరదా. మాలాడ్జిలో చాలా స్థలం ఉండేది. కొన్ని మొక్కలు నేనే తెచ్చి వేసి వాటికి నీళ్లుపోస్తూ పాడుకుంటూఉండేవాడిని.

మాలాడ్జి కెదుటింట్లో ఒకపోలీసు ఇనస్పెక్టరుగా రుండేవారు. ఒకనాడు సాయంకాలం మొక్కలకు నీళ్లుపోసేక వీథిగుమ్మంలో ఒక్కడినీ నిలబడ్డాను. ఇనస్పెక్టరుగారి భార్య "అబ్బాయీ! ఇలా రా" అని పిలిచింది. నేను వెళ్లేను. సావిట్లో కూర్చోపెట్టి "నిన్న పాడిన పాట ఒకసారి పాడు" అంది. పాడేను. "ఆ పాట నాకు వ్రాసియిస్తావా?" అంది. 'సరే' అన్నాను. ఆమెకుమార్తె తొమ్మిది, పది వత్సరములు గల రమణి కాగితమూ పెనసలూ వెంటనే తేగా వ్రాసియిచ్చేను.

ఇంతలో మావాళ్లు నేనాయింట్లోంచి రావడం చూచి "ఏంరా, అమ్మాయితో స్నేహం కుదిరిందిరా" అని కొంచెం వేళాకోళం చేశారు. జరిగింది చెప్పేను. మరోనాడు ఇనస్పెక్టరుగా రున్నప్పుడే పాటలు పాడించి మిఠాయి పెట్టేరు. ఇంతలో నా చామంతితోట బాగా పెరిగింది. రమణి పువ్వు లడిగేది. కాని నేను సామాన్యంగా యిచ్చేవాడిని కాను. అసలు ఎవరినీ కోయనిచ్చేవాడినే కాను. కొద్దికాలంలో నాపాటలు చాలా రమణికీ, రమణిపాటలు కొన్ని నాకూ వచ్చేయి. వాళ్లు నేను పాటలు పాడినప్పుడల్లా ఫలహారములు పెట్టేవారు. అంచేత వారు కోరినప్పుడల్లా పాడేవాడిని.

అప్పటికి నేను స్కూలుఫైనల్‌లోకి వచ్చేను. హఠాత్తుగా రమణి నాలుగురోజులు కనపడలేదు. తరువాత పైటవేయడం మొదలుపెట్టింది. మొదట చూచినపుడు నాకు కొంచెం నవ్వువచ్చింది. రమణికూడా నవ్వుతూ లోపలకు పారిపోయింది. తరువాత రమణితోనే నెప్పుడూ మాటలాడలేదు. నాకు కొంచెం చదువు హెచ్చైంది. పాటలు తగ్గేయి. కాని బడినుంచి వస్తూ అప్రయత్నంగా లాడ్జిలోకి వెళ్లేముందు రమణిగుమ్మం వేపు తప్పక చూచేవాడిని. ఆమె నేను వచ్చే సమయానికి వాళ్ల కిటికీలో కూర్చొనిఉండేది. నన్ను చూచి చిరునవ్వుతో లోపలికి వెళ్లిపోయేది. నేను పాట పాడినప్పుడల్లా సావడికిటికీలోకి వచ్చి కూర్చొనేది.

నాపరీక్షలు కాగానే మావూరు నేను వెళ్లిపోయేను. వెళ్లేముందు ఇనస్పెక్టరుగారి భార్యతో 'వెళుతున్నా'నని చెప్పేను. ఆయన యింట్లో లేరు. రమణి తల్లి ప్రక్కనే ఉంది. ఏదో మాటాడాలని ఉన్నట్టు కనపడింది. కాని మాట్లాడలేదు. నాకూ మాట్లాడా లనిపించింది. కాని యేమి మాట్లాడ్డం?

మరి నాలుగేళ్లవఱకు నేను విశాఖపట్నం పోలేదు. అప్పటికి నేను బి. యే. ప్యేసు అయాను. ఉద్యోగప్రయత్నంమీద విశాఖపట్నం వెళ్లేను. పూర్వపు స్నేహితులను, పూర్వము మేముండే లాడ్జీని తలుచుకుంటూ ఆవీథంటే సముద్రపుటొడ్డుకు వెళుతున్నాను. నే ననుకోకుండా నామనస్సు రమణిమీదకు, నాదృష్టి ఇనస్పెక్టరుగారి యింటివైపునకు వెళ్లేయి. ఆయన ఒక సంవత్సరం క్రిందటనే ప్రమాదవశమున మరణించినట్లు పేపరులో చూచేను. అది తలపునకు వచ్చి నేను కొంచెము విచారిస్తూ వెళుతూ ఉంటే ఒక యెనిమిదేండ్ల బాలుడు వచ్చి "అమ్మ మిమ్మల్ని పిలుస్తూంది." అన్నాడు. 'ఎవరా యీ అబ్బాయి' అని కొంచెం ఆలోచించగా ఇనస్పెక్టరుగారి కొడుకని జ్ఞాపకం వచ్చింది. పరామర్శచేయుటకు నేనే వెళ్లవలసింది; పిలిచినాకూడా వెళ్లకుండా యెలా ఉండను? సావిడిలోకి వెళ్లగానే ఆవిడ కొంత విచారించగా ఓదార్చడము చేతకాకపోయినా యేదో ఓదార్చి, నాచదువువిషయ మడుగగా చెప్పేను. ఆమె సంతోషించి "ఎక్కడ బసచేసేరు?" అంది. "ఒకపూటకు ఎక్కడైతే నేమిటి? హోటలులో భోజనము చేసేను. రాత్రి అక్కడే పడుకుంటా. రేపు వెళతా." అన్నాను. "ఇక్కడ ఉండడాని కభ్యంతర ముంటుందా? ఈరాత్రి కిక్కడ ఉంటే నాకష్టాలన్నీ మీతో చెప్పుకుంటాను. అవి చెప్పుకోడానికి వినేవాళ్లైనా లేరు. అందుచేత మరీ బాధగా ఉంది." అంది. "సరే" అన్నాను.

తర్వాత ఆవిడ చెప్పిన విషయములను బట్టి యినస్పెక్టరుగారు ఏడాదిక్రిందట పోయారనీ, అప్పటి కాయిల్లూ, ఆమెవంటిమీది బంగారమూతప్ప వేరే ఆస్తి లేదనీ, సంసారము గడపడము బాధ్యతే ఆమెమీద పడ్డదనీ, మీవంటివారి దయవలన ఎలాగో కాలక్షేపము చేస్తున్నామనీ, యేవేవో చెప్పింది. పిమ్మట కాస్త దాహమునకు మంచినీళ్లిమ్మన్నాను. లోపలకు వెళ్లి ఐదునిమిషములలో తిరిగివచ్చి "కాస్త ఫలహారంకూడ పుచ్చుకోవలె" నంటూ "రమణీ?" అని పిలిచింది. ఆమెతో మఱల లోపలికి వెళ్లి తిరిగివచ్చి, "మా యిల్లుమీకు క్రొత్తకాదు రండి; లోపలకు" అని ఆహ్వానించింది. "ఎందుకు లెండి!" అంటూ అక్కడే కూర్చోబోగా లోపలకు రమ్మని బలవంతంచేస్తే వెళ్లేను. వరండాలో ఒక కుర్చీమీద కూర్చున్నాను. రమణి ఒక ప్లేటులో రెండు చపాతీలు తెచ్చిపెట్టి చిరునవ్వుతో నిలుచుంది. రమణి కిప్పుడు పదహారేండ్లు వుంటాయి. నాకు ఆశ్చర్యం వేసింది. నాలుగేండ్లక్రిందటే నాతో మాట్లాడడం మానేసి, కనబడకుండా ఉండే పిల్ల యిప్పు డిలా ఆహ్వానించడం అంటే ఆశ్చర్యం కాదూ!

అప్పుడు వాళ్ల తల్లివైపు చూచి "మీ అమ్మాయికి పెండ్లిచేశారా?" అని అడిగేను. "ఏం పెళ్లి లెండి; మాలో అంత సుళువైన విషయం కాదు. రమణి అభిప్రాయం నాతో యేమీ చెప్పదు. స్నేహితులుగనక మీతో చెబుతుందేమో? నాకు తెలియదు బాబూ! ఈకాలపువాళ్ల మనస్సులు తెలుసుకోవడము ఎవరికి తరం?" అని ఏవేవో అంటూంది. ఈలోపుగా వీధిగుమ్మంలో ఎవరో కేకవేస్తే ఆవిడ వెళ్లింది. వెంటనే వస్తుందేమో నని కదలకుండా మెదలకుండా చూసేను. రెండు నిమిషాలవఱకు. కాని వీథి అరుగుమీద బైఠాయించినట్లు తోచింది.

రమణి ప్రక్కనే నిలుచుంది. ఆమెముఖము చూచేసరికి కొంచెం విచారముతోను, ఆలోచనతోను ఉన్నట్లు కనపడింది. రమణి చిన్నప్పుడూ అందమైన పిల్లేకాని అంత అందమైనదని అంతకుముం దెన్నడూ అనుకోలేదు. "రమణీ, నన్ను పూర్తిగా మరచిపోయావా" అని అన్నాను. "నేను మరవలేదుకాని మీరు పూర్తిగా మరచిపోయినట్టు నాకు తెలుసు" అన్నది. "ఏమీ?" అన్నాను. "మానాన్నగారు పోయినట్లు తెలిసీకూడా మాయింటివైపేనా చూడకుండా వెళ్లడమే" అంది. "అబ్బే! మరచిపోవడం కాదుకాని, నాకు పరామర్శచేయడం తెలియకపోవడంచేతను, మాటాడితే బాగుంటుందో లేదో అన్న అనుమానంచేతను వెళ్లిపోయా" నన్నాను. "అయితే మళ్లా యెందుకు వచ్చారు?" అంది. "మీతమ్ముడు పిలుస్తే" అన్నా. "ఏమని" అని అడిగింది. "మా అమ్మ పిలుస్తున్నారని." "మాఅమ్మ నాసంగతేమైనా చెప్పిందా"? "లేదుకాని నీవేమి అలా ఉన్నావు?" అన్నా. "మీ రెందుకు వచ్చారు? మీ రిలా వస్తారని నే నెప్పుడూ అనుకోలేదు. మీరు చాలా పెద్దమను

ష్యులని నేను నమ్ముతూ ఉండేదాన్ని" అంది. "అయితే నా కిప్పు డేం లోటు"? అన్నా.

"మీకు వివాహమైందా?"

"లేదు; నీవెందుకు చేసుకోలేదు?"

"నాకా? తెలిసా, నిజంగా తెలియక అడుగుతున్నారా?"

"ఏం, యెలా తెలుస్తుంది?"

"వినిరాలేదూ? అమ్మ చెప్పలేదూ?"

"ఏం చెబుతుంది" అన్నా. ఒక్క నిట్టూర్పు విడచి నా వేపు పరిశీలనతో చూస్తూ "మాకులం మీకు తెలీదూ?" అంది. "నాయుళ్లు" అన్నా. "కాదు. భోగంవాళ్లు" అంది తల వంచుకొని.

నాకు ఒక్కసారి భయం, సిగ్గు వేసింది. నేను భోగంవాళ్ల యింట్లో ఆరాత్రి ఉన్నట్లు ఎవరికేనా తెలిస్తే యేమనుకుంటారు? వెంటనే లేచి వెళిపోదామనిపించింది. కాని అంత అమాయకంగా నిజం చెప్పిందే, ఏదో కష్టదశలో ఉన్నట్లుందే, కనుక్కోకుండా వెంటనే వెళితే యేం బాగుంటుంది అనిపించింది. రెండునిమిషాలు ఆలోచించి "అయితే?"అన్నా. "అందుకే మాఅమ్మ మిమ్మల్ని పిలిచి ఉంటుంది. నేను యీవిధంగా డబ్బుగణించిపెట్టాలిట" అంది దీనంగా. "అందుకే మీరు వచ్చే రనుకున్నా. క్షమించాలి. నేను తప్పుఅభిప్రాయపడ్డాను" అన్నది సిగ్గుతో. "గణిస్తున్నావా? " అన్నా. "ఏమి చేయమంటారు? నాకు చిన్నతనంలో తెలిసినవారు మీరొక్కరే. ఒకసారి మీ కుత్తరము వ్రాయా లనుకున్నాను. కాని దానివలన నాకు లాభము లేకపోవడం సరేకదా మీకు నష్టం కలుగుతుందేమోనని వ్రాయలేదు" అంటూ ఉండగానే కళ్లవెంబడి రెండు కన్నీటిచుక్కలు రాలేయి. వెంటనే కనబడకుండా తుడుచుకుంది. మఱి నోట మాట రాలేదు. రెండునిమిషాలవఱకు ఎవరమూ మాటాడలేకపోయాము. తరువాత నేనే "నీవు యెవరినైనా పెండ్లిచేసుకోకూడదూ?" అన్నా. "అది మా అమ్మకు యిష్టంలేదు. ప్రేమలేనివారిని పెండ్లిచేసుకున్నా, ఈవృత్తిలో ఉన్నా ఒకటే అని నా అభిప్రాయం" అంది. "ప్రేమించినవారినే పెండ్లియాడరాదూ?" అన్నాను.

"అది అసాధ్యమేమో అని తోస్తోంది"

"ఏం" అన్నా.

"అది మీరే చెప్పాలి" అంది.

"అదేమిటి"

"నేను ప్రేమించింది మిమ్మన్నే" అంది. నేను ఆశ్చర్యంతోను, అనుమానంతోను ఆమెముఖము వైపు పరిశీలనగా చూచేను. నాదృష్టికి ఆగలేకేమో అన్నట్లు ఆమె ముఖం కొంచెం వంచి దాచుకుంది. "అది అసంభవం, అబద్ధం. మీకులంవాళ్లు చేసే మాయల్లో యిది ఒకటాయేమిటి?" అన్నాను. "మీరు నమ్మరని నాకు మొదటే తెలిసి మీకు వ్రాయలేదు. మీరు నమ్మకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. మావాళ్లు అటువంటి వేషాలువేయడంకూడా ఉండవచ్చు. కాని చిన్నతనం నుండి కులంవాళ్లలాగ పెరగలేదని మీకు తెలుసు. అదీగాక మీరు ఒకప్పుడు నన్ను ప్రేమించారేమో అనే ఆశతో ఇన్నాళ్లాయి ఉన్నాను. ఇప్పుడు మీతో చెప్పేసేను. నమ్మినా సరే, నమ్మకపోయినా సరే" అంది. నేను ఆమెను ప్రేమించానా అని ప్రశ్న మనస్సునకు వేసేసరికి నావొళ్లు ఝల్లుమంది. నేను చిన్నతనంలో ప్రేమ, పెళ్లి గుఱించి యెప్పుడూ అనుకోలేదు. నాపాట ఆ అమ్మాయి వినాలనీ, నన్ను పువ్వులు అడగాలనీ, కొంతసేపు యేడిపించి యివ్వాలనీ ఉండేది. తరువాత కిటికీలో కూర్చుంటే బడినుండి వచ్చేటప్పుడు తప్పకుండా చూచేవాడిని. చిరునవ్వులు కూడ ఇటూ అటూ చూచి నవ్వుకొనేవారము. అటువంటి పిల్లను పెండ్లాడాలని ఒకసారి అనిపించింది. కాని నేను బ్రాహ్మణుడను. ఆమె బ్రాహ్మణేతర. అందుచే ఆమెను పెండ్లాడాలనే కోరిక నాకెప్పుడూ కలగలేదు. ఇప్పు డామె అందం, చందం, మాట, యౌవనం చూడగానే మనస్సులో చాలా ఆందోళన కలిగింది. కొంచెం మనస్సు చలించింది. ఇప్పటికి సరే అంటే ఏంపోయింది అనిపించిందికూడాను. కాని ముందుసంగతి ఆలోచించగా భయం వేసింది. అంత మోసం చేయడమా అనిపించింది. తుద కామెముఖము వైపు మరల చూసేను. ఆశ, అమాయకత్వం చిత్రించినట్లు కనపడ్డాయి. నాతలపులు నాకే సిగ్గుకలిగించాయి. "నేను నిన్ను ప్రేమించడానికి వీలులేదు" అన్నాను. "ప్రేమకు వీలుంటుందా? పెళ్లికికాని" అంది. నిజమే అనిపించింది. నాజీవితంలో ఏదో వెల్తిగా కనపడింది. నాకు ఆమె కావాలి అనిపించింది. కాని చంద్రుడు కావాలంటే వస్తాడా? కాక ప్రేమించి లాభమేమిటి? పెండ్లాడకపోతే? ఒకవేళ కులంసంగతి యేమనుకున్నా ఆవృత్తిలో అప్పుడే దిగినఆమెను పెండ్లాడడ మెట్లా? కాక ఆవృత్తిలో దిగి జీవనం కొంతకాలం గడుపుతున్నవాళ్లకి ప్రేమ ఉంటుందా అని నాకు గొప్ప సంశయం. ఈతలంపులన్నీ రెండునిమిషాల్లో నాతలలో

పరిగెట్టాయి. గుండెనిబ్బరం చేసికొని గుటకలు మ్రింగుతూ "నీవన్నది నిజమే కాని, ప్రేమ, పెండ్లి రెండూ ఒకటే అని నాఅభిప్రాయం. మన కుల మర్యాదల ననుసరించి మన కది తలపెట్టడానికి వీలులేని విషయం. నీవు నటిస్తున్నావో, లేక దుర్భ్రమపడ్డావో తెలియదు." అన్నాను.

ఒక చిన్న నిట్టూర్పు విడచి, కంట తడివత్తుకొని "మీరు ఇలా అంటారని అనుకోలేదు. ఇది నా అదృష్టం. మీరేంచేస్తారు? మిమ్మల్ని వివాహంచేసుకోవలెనని కూడ పోనీ నే కోరను. ఎప్పుడైనా మీ దర్శనం ఇవ్వడానికి వీలౌతుందా? దీనికి కూడ మీ సంఘము అడ్డుతుందా?" అంది. "అది నా నైతిక జీవనానికి విరుద్ధం. నిన్ను నేను ప్రేమించడానికి వీలులేదు. నన్ను వెళ్లనీ" అంటూ నే లేచాను. "పోనీ, మిమ్మల్ని ప్రేమించానని జ్ఞాపకమైనా ఉంచుకోండి. వీలైతే" అంది. ఆమె నావైపు అతిదీనంగా, నిరాశతో చూచింది. నాగుండె నీరైపోయింది. అక్కడ ఉండడానికి భయమేసింది. గుండెలు త్వరితంగా కొట్టుకుంటున్నాయి. మనస్సు బిగబట్టి నే వీధిలోకి వచ్చేను. ఆమె గదిలోకి వెళ్ళింది. వెక్కి వెక్కి యేడుస్తున్నట్లు నాకు కొంచెం వినపడ్డది. తల్లి వీథరుగుమీంచి లేచి "అయ్యో, వెళ్తున్నారేం?" అంది. "నే వెళ్లాలి" అంటూ గుమ్మం దిగి గబ గబ తిరిగి చూడకుండా వెళ్లేను.

ఆ వీథంట మళ్లీ వెళ్లకూడ దనుకున్నా. కాని ఆ మరునాడు స్నేహితులతో ఆలాగే వెళ్లవలసి వచ్చింది. రమణిశవం వీథిగుమ్మంలో ఉంది. ఆమె ఆత్మహత్య చేసుకొనినట్లు ఉత్తరముదొరికినదని అచటి వారు చెప్పుకుంటున్నారు. నేనే ఆమె ఆత్మహత్యకు కారణుడనేమో అని భయం, బాధ కలిగేయి. వెంటనే స్నేహితులతో షికారుపోవుట మాని బసకు చేరాను. కిటికీలోంచి పోష్టువా డొక కవరు పడవేసి పోయినాడు. వెంటనే విప్పుకొని చూడగా దానిలో— "నమస్కారములు.

నిజము ఈ నాడే మీరు తెలుసుకో గలరు. నన్ను జ్ఞాపకముంచుకోవలయునని నా ఆఖరు కోరిక.

ఇట్లు మీ
ర ................."

తరువాతి అక్షరములు కన్నీటి చుక్కల్లో కరిగి పోయాయి. ఆ ఉత్తరం ఇప్పటి కింకా నాదగ్గ రుంది.

లోకం అంతా మరచినా నేను రమణిని మరువలేదు. మరువలేను. లోకంకూడా మరువకూడదని ఈ కథ వ్రాసేను. నా కిప్పుడు నలభై దాటాయి. నలుగురు పిల్లలు. నా పెద్దకూతురుపేరు రమణి. అది మూడు మూర్తులా రమణే. ఆమె మా యిద్దరిలో ఎవరినీ పోలక రమణిని పోలుట మిక్కిలి యాశ్చర్యము. అందరిలోకీ అందమైనది. ఆమె మీద తక్కిన పిల్లలందరి కంటే ఎందు కంత ప్రేమో అని అందరూ ఆశ్చర్యపోతూ ఉంటారు. రమణి కాలగతి పొందునప్పటికి పదునెనిమిదేండ్ల నిండు జవ్వని. మా రమణి కిప్పుడు పద్దెనిమిది వత్సరములే. ఆ రమణియే బ్రాహ్మణ కులంలో పుట్టిఉంటే ఎంత బాగుండేది. లేక నేనే కులభేదాలు పాటింపకుండా ఆమె మాట నమ్మితే ఎంత బాగుండేది!





కుమార్స్ హెర్టోన్

(రిజిష్టర్డు)

వనమూలికల తలనూనె. సుకుమారమైన సువాసనతో నొప్పారునది. శిరస్సును చల్లబఱచి. హాయి కలుగజేయును. శిరోజములను నల్లగా, నిడివిగా, దట్టముగా పెంచును.

కుమార్ ఇండస్ట్రీస్,
గాంధీనగరం, : : బెజవాడ,

ఏజంట్లు : ఆర్. యన్. రాజన్,
43, బందరువీధి, మద్రాసు.